క్లుప్తంగా

ప్రమాణ స్వీకారానికి రావాలని ఎమ్మెల్సీకి ఆహ్వానం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కార్య వర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని ఎమ్మెల్సీ దండె విఠల్‌ను ఆహ్వానించినట్లు ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి వెంకటేశ్, కొంగ సంపత్‌కుమార్ సోమవారం తెలిపారు. మంగళ వారం పట్టణంలోని సంతోశ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్సీతో పాటు ఎమ్మెల్యే హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, పట్టణ పద్మశాలి కౌన్సిలర్లు హాజరవుతారని, పేర్కొన్నారు.

‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి’

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉత్తర తెలంగాణాను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని వేముల నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయంతోపాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ఒక సేవకుడిలా పని చేస్తానని పేర్కొన్నారు.

వన్యప్రాణులను కాపాడాలి

తిర్యాణి: వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అడవులు సురక్షితంగా ఉండాలంటే వన్యప్రాణాలను రక్షించాలిస్న అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో గిన్నెదరి రేంజ్ అధికారి వెంకన్న, ఎఫ్ఎస్‌వోలు ఆత్రం రవీందర్, భీమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు


మరమ్మతు చేయిస్తున్న నాయకులు

బెజ్జూర్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ రాష్ట్ర టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్ మండలంలోని కృష్ణపెల్లి నుంచి సోమిని గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి సోమవారం మరమ్మతులు చేయించారు. తమ గ్రామానికి బస్సు నడిచేలా రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఇటీవల గ్రామస్తులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా ఇచ్చిన హామీ మేరకు మరమ్మతులు చేయించినట్లు అర్షద్ హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగ ఓంప్రకాష్, ఫసీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ‘కంది’

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్కను కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆమెతో భేటీ అయి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

ఇచ్చోడ: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పారదర్శకంగా చేపట్టాలని జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. సోమవారం అడేగామ(బి)లో నిర్వహించిన సర్వే వివరాలను పరిశీలించారు. ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ సర్వే కార్డుల సర్వే మండలాలని ఒక్కటి చొప్పున పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు సర్వే పూర్తయిన తరువాత మండల వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. సర్వే ద్వారా ప్రతీ కుటుంబం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

సిరికొండ: మండలంలోని పోచంపల్లి అడవిలో సిరిచెల్మ రేంజ్ అటవీ శాఖ అధికారులు పోచంపల్లి పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. సిరికొండ అ టవీశాఖ అధికారి కాలేందర్, పోచంపల్లి అటవీ శాఖ అధికారి హీరాలాల్ విద్యార్థులకు వన్యప్రాణుల ద్వారా కలిగే లాభాల గురించి, శిక్షల గురించి అవగాహన కల్పించారు.

చివరి మజిలీకి తిప్పలు

- అసంపూర్తిగా శ్మశాన వాటిక
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


అసంపూర్తిగా వైకుంఠధామం

తిర్యాణి: చివరి మజిలీకి ప్రజలు ఇబ్బంది పడవద్దని గత ఐదు ఏళ్ల క్రితం అన్ని గ్రామ పంచాయతీల్లో శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఒకొక్క శ్మశాన వాటిక నిర్మాణం కోసం రూ. 12 లక్షల నిధులు మంజూరు చేసింది. శ్మశాన వాటిక వద్ద బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులతో పాటు మంచినీటి సౌక్యరం, మృతదేహాలను దహన సంస్కారాలు చేసేందుకు అనువుగా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. దీంతో గ్రామాల్లో కొంత వరకు కష్టాలు తప్పాయి. అయితే మండలంలోని దాదాపు అన్ని పంచాయతీలల్లో వైకుంఠధామాలు పూర్తి అయి వినియోగిస్తుండగా.. మండల కేంద్రంలోని శ్మశాన వాటిక మాత్రం నేటికి అసంపూర్తిగానే దర్శనమిస్తోంది.

పూర్తికాని పనులు..

రూ. 12 లక్షలతో వైకుంఠధామం నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించాడు. 70 శాతంకు పైగా పనులు సైతం పూర్తి చేశాడు. అందుకు సంబంధించి అప్పటి ఇంజనీర్ అధికారులు ఎంబీ రికార్డు చేసి రూ. 3.30 నిధులను కాంట్రాక్టర్ ఖాతాలో వేశారు. పనులు పూర్తయిన తరువాత మిగతా పనులకు సంబంధించి ఎంబీ రికార్డు నమెదు చేసి నగదును గుత్తెదారు ఖాతాల్లో జమ చేస్తారు. కానీ సదరూ కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడంపై ఆసక్తి చూపకపోవడంతో వైకుంఠధామం అలంకారప్రాయంగా మారింది. పూర్తిస్థాయిలో నిధులు విడుదల అయితే గతంలో కాంట్రాక్టర్ అడ్వాన్స్ రూపంలో తీసుకున్నా రూ. 5 లక్షల నగదు కూడా జమ అయ్యే అవకాశం ఉంటుంది. ఆ నగదుతో గ్రామాభివృద్ధికి వినియోగించవచ్చు. అయితే శ్మశాన వాటిక లేకపోవడంతో మండల కేంద్రంలోని ప్రజలు వాగు, వంకల సమీపంలో మృతదేహాలకు దహన సంస్కారాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠధామం పనులు పూర్తి చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

> **పనులు పూర్తి చేస్తాం**
>
> మండల కేంద్రంలోని శ్మశాన వాటిక పనులు చేయించేందుకు కృషి చేస్తాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తయ్యేలా చూస్తాం. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.
>
> – వేముల మల్లేశం, ఎంపీడీవో తిర్యాణి

వంతెనలు ప్రారంభించేదెప్పుడో?

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


వంతెన వద్ద పూర్తికాని అప్రోచ్ రోడ్డు పనులు

సిర్పూర్(టి): నియోజకవర్గంలో నదులు, వాగులపై వంతెనలు పూర్తయిన అధికారికంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో గత్యంతరం లేక తప్పనిసరి పరిస్థితుల్లో వాహనదారులు, ప్రజలు వంతెనలపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సిర్పూర్(టి) నియోజకరవ్గం మీదుగా పక్కనే ఉన్న మహారాష్ట్ర జిల్లాలకు అనుసంధానంగా ఉన్న వంతెనలు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా.. అధికారికంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ప్రారంభించాల్సిన వంతెనలు..

- సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామం మీదుగా వెంకట్రావ్‌పేట్- పోడ్సా అంతర్రాష్ట్ర వంతెన 2013లో పూర్తయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నేటికి ప్రారంభించలేదు. వంతెన కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్, గడ్చిరోలీ జిల్లాలోని గ్రామాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లే ప్రధాన రహదారి వంతెన.
- చింతలమానెపల్లి మండలంలోని గూడెం- అహెరీ వంతెన 2022లో పూర్తయినా ఇంకాల ప్రారంభంకాలేదు. ఈ వంతెన మీదుగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి మహారాష్ట్రలోని గడ్చిరోలీ జిల్లా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల రాకపోకలు సాగించవచ్చు.
- పెంచికల్‌పేట్ మండలంలోని పెంచికల్‌పేట్-దహెగాం గ్రామాల మధ్య ఉన్న వాగుపై నూతనంగా నిర్మించిన వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు మాత్రం పూర్తి కాలేదు. అయినా.. స్థానికులు వంతెనపై నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు.
- సిర్పూర్(టి) మండలంలోని సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో వేంపల్లి రైల్వేగేట్‌పై నూతనంగా రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి 2015-16 సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణం పనులు నత్తనడకన సాగడంతో 2024లో పూర్తయింది. వంతెన పూర్తయినా అప్రోచ్ రోడ్డు పూర్తి కాకపోవడంతో వంతెనపై నుండి రాకపోకలు సాగడం లేదు.
- బెజ్జూర్ మండలంలోని కుష్ణపెల్లి వాగుపై వంతెన నిర్మాణానికి 2018లో నిధులు మంజూరు కాగా 2022లో పనులు పూర్తయ్యాయి. నేటికి అధికారికంగా ప్రారంభించకపోవడంతో వాహనదారులే ప్రారంభించి రాకపోకలు కొనసాగిస్తున్నారు.
- బెజ్జూర్ మండలంలోని చిన్నసిద్ధాపూర్ వాగుపై నూతన వంతెన నిర్మాణానికి 2018లో నిధులు మంజూరు కాగా 2022లో నిర్మాణం పూర్తయింది. దీంతో వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలో నూతన వంతెన నిర్మాణాలు పూర్తయినా అధికారికంగా ప్రారంభించకపోవడంతో వాహనదారులు అసౌకర్యాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనలు, అప్రోచ్ రోడ్లు ప్రారంభించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శరన్నవరాత్రులు


దుర్గామాతను దర్శించుకుంటున్న జీఎం దేవేందర్, అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీ ఆవరణలో గల దుర్గామాత ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఉమారాణి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. హోమం, నిత్యపూజ, దుర్గాహవనం, కుంకుమార్చన పూజలు చేశారు. ఓసీపీకి చెందిన అధికారులు, ఉద్యోగులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీవో నరేందర్, మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఎస్‌వో రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

- మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయంలో అమ్మవారు మహాచండీ దేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గుహలో పడుకుని ఉన్న మహంకాళి అమ్మవారి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ తీర్థప్రసాదాలను అందచేశారు.


పూజలు చేస్తున్న మహిళలు

కౌటాల: మండల కేంద్రంలోని వాసవి మాత ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో మహిళలు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వొజ్జల వెంకన్న, విజయ్, కృష్ణ, రవి, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

ఉద్యోగులకు బదిలీలు సహజం


ఏవోకు స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

తిర్యాణి: ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారిగా తిరుమలేశ్వర్ విధులు నిర్వహించి కరీంనగర్ జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం మండలంలోని చింతపెల్లి రైతువేదికలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అంతకుముందు నాయకపుగూడ గ్రామం నుంచి రైతువేదిక వరకు ఆదివాసీ సంప్రదాయ వేషధారణలో నృత్యం చేస్తూ స్వాగతం పలికారు. గత 14 సంవత్సరాలుగా మండలంలోని రైతులకు తిరుమలేశ్వర్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి సలహాలు, సూచనలు అందించి పంట దిగుబడికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అత్రం చంద్రశేఖర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సార రమేశ్ గౌడ్, బోమ్మగాని శంకర్ గౌడ్, శ్రీనివాస్, పులి వెంకటేశ్, ఏఈవోలు సాగర్, ముత్తయ్య, శ్రవణ్, ఆదిత్య పాల్గొన్నారు.

ప్రతీనెల వైద్య పరీక్షలు చేయించుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వాంకిడి: గర్భిణులు ప్రతీ నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్ అన్నారు. సోమవారం మండలంలోని ఇందాని ఉప ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. ప్రసూతి ఆసుపత్రిలోనే జరిగేలా వారం రోజుల ముందే చేరాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మమత, కాంత, భగవాన్‌దాస్, కమల, తదితరులు పాల్గొన్నారు.

హమాలీలుగా స్థానికులను తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న స్థానిక కూలీలు

తాంసి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పంటల కొనుగోలు కేంద్రాల్లో స్థానిక కూలీలను హమాలీలుగా తీసుకోవాలని స్థానిక కూలీలు డిమాండ్ చేశారు. తాంసి సోయా క్రాంతికర్ హమాలీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీహార్ కూలీలతో పనులు చేయించడం ద్వారా స్థానికంగా తమ ఉపాధి దూరం అవుతుందన్నారు. హమాలీలుగా స్థానికులకు పని కల్పించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జిల్లా నాయకుడు సంతోశ్ కుమార్, హమాలీ కూలీలు రాజు, సంతోశ్, శాలిక్‌రావు పాల్గొన్నారు.

నీటి సరఫరా సహాయకులకు శిక్షణ పూర్తి


సర్టిఫికెట్లు అందుకుంటున్న గ్రామ నీటి సహాయకులు

సిరికొండ: గత నాలుగు రోజులుగా గ్రామ నీటి సహాయకులకు మంచినీటి సరఫరా, పైపుల లీకేజీలు, విద్యుత్ మోటార్ల మరమ్మతులపై శిక్షణ నిర్వహించారు. సోమవారం శిక్షణ పూర్తయింది. మిషన్ భగీరథ ఎస్ఈ సురేశ్, ఈఈ చంద్రమోహన్, ఏఈఈ జైపాల్ శిక్షణను పరిశీలించారు. నీటి సరఫరాలో ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. లీకేజీలు, మోటార్ మరమ్మతులు వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

తాంసి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గోపాలకృష్ణ మఠాధిపతి యోగా నంద సరస్వతి అన్నారు. ఆదివారం రాత్రి భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో దుర్గామాత మండపం వద్ద సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై దుర్గామాత వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలచే కుంకుమార్చన చేయించారు. కార్యక్రమంలో గ్రామ వీడీసీ అధ్యక్షుడు నవీన్, బొంత నితిన్, రాకేశ్, లస్మన్న, గంగయ్య పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో ఈనెల 10న నిర్వహించే బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను సోమవారం హిందూ ఉత్సవ సమితి నాయకులు పరిశీలించారు. బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనే ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి నాయకులు సిందం శ్రీనివాస్, విశ్వేశ్వర్‌రావు, దెబ్బటి శ్రీనివాస్, తుమ్మ రమేశ్, హనుమంతరావు, రాజ్‌కుమార్, తాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే బొజ్జన్న బువ్వలక్ష్యం

ఉట్నూర్‌రూరల్: పేదల ఆకలిని తీర్చడమే లక్ష్యంగా ప్రతీ సోమవారం బొజ్జన్న బువ్వ కార్యక్రమం చేపడుతున్నట్లు నాయకులు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో బొజ్జన్న బువ్వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివి ధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు భోజనం అందించారు. కార్యక్రమంలో జైవంత్ రావు, మెస్రం నగేశ్, మోబీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలి

ఉట్నూర్‌రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పొలసాని సుగుణాకర్‌రావు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కార్యచరణతో పాటు పట్టభద్రులతో చర్చించారు. సమావేశంలో నాయకులు శ్రీరాంనాయక్, కొండేరి రమేశ్, వెంకటేశ్, జగ్జీవన్, ధన్‌లాల్, బాలాజీ, బొడ్డు కిరణ్, జగన్, సతీశ్, రాంచందర్ పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయానికి చేరిన బతుకమ్మ చీరలు

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది ఆడపడుచులకు కానుకగా అందించే బతుకమ్మ చీరలు సోమవారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం మైసం రమేశ్ గ్రామాల వారీగా చీరలను సర్దుబాటు చేశారు. మండలానికి మొత్తం 12,960 బతుకమ్మ చీరలు వచ్చినట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు పంపిణీ చేసి,విడదల వారీగా మహిళలకు అందజేస్తామన్నారు. వారి వెంట సీసీ శ్రీరాం, కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్సీ


ఎమ్మెల్సీని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడలో శ్రీభజరంగ్‌దళ్ దుర్గా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని సోమవారం రాత్రి ఎమ్మెల్సీ దండె విఠల్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీని కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలో గల ఎమ్మెల్యే నివాసంలో సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే హరీశ్‌బాబు పంపిణీ చేశారు. రూ. 13 లక్షల 69 వేల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పకడ్బందీగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు.